క్లుప్తంగా...

నేడు డయల్ యువర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్

సంతోష్‌నగర్: ఈ నెల 20న సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డయల్ యువర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ) తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ-దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మిధాని-మహేశ్వరం తదితర ప్రాంతాల ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలపాలన్నారు. 99592 26136లో సంప్రదించి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఖిల్వత్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధికల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్న నందిగామ మైత్రిప్రియ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్బన్‌సిటీ ఇన్‌ఫ్రా డెవలపర్, శుభగృత, రత్నదీప్ తదితర సంస్థలలోని 100 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ విద్యార్హతతో పాటు 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలతో శనివారం ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 83284 28933 లో సంప్రదించవచ్చు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ప్రభుత్వ ఐటీఐ శాంతినగర్ మల్లేపల్లి కళాశాలలో వివిధ రకాల కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 17 నుంచి జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. నిర్దేశిత వెబ్‌సైట్ ద్వారా ఆయా కోర్సులకు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు స్పందన

గోల్కొండ: తాము నిర్వహిస్తున్న డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తుందని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. గతంలో కంటే తాము మరిన్ని మెరుగైన సౌకర్యాలతో బస్సులను నడిపిస్తున్నామన్నారు. ప్రస్తుతం అన్ని రూట్లలో బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గోల్కొండ, శంకర్‌పల్లి, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఆ రూట్లలో మరిన్ని బస్సు సర్వీసులు నడపాలని కోరారన్నారు.

గోల్కొండ డీఐకి సన్మానం



గోల్కొండ: గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించడం తనకెంతో తృప్తినిచ్చిందని గోల్కొండ డీఐ మట్టం రాజు అన్నారు. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయిన డీఐ మట్టం రాజును తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు, స్థానికులు పోలీసులకు ఎప్పుడూ తమ సహాయ సాకారాలు అందిస్తుంటారన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆలయం ముస్తాబు

గోల్కొండ: దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనకు నానల్‌నగర్ తిరుపల్లిగడ్డలోని శ్రీకోవెల రంగనాథస్వామి ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. ఈ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి సమేత గోదారంగనాథ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠింపజేయనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. శుక్రవారం ఆయన కొత్తగా నిర్మించిన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాల చరిత్ర గల కోవెల రంగనాథస్వామి ఆలయ పునరుద్ధరణ, నూతన దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 31న లక్ష్మీనరసింహస్వామి సమేత గోదారంగనాథ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

పాతబస్తీలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

- లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్లతో పాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సైతం
- కొత్తగా ఏర్పాటైన లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పీఎస్‌లకు సైతం కొత్త ఇన్‌స్పెక్టర్లు

చార్మినార్: పాతబస్తీలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు పెద్ద ఎత్తున జరిగాయి. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని పాతబస్తీ లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లతో పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు.

- చార్మినార్ పోలీస్‌స్టేషన్ (లా అండ్ ఆర్డర్) ఇన్‌స్పెక్టర్‌గా విధులు కొనసాగుతున్న బి.గురు నాయుడు సీసీఎస్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బాలేబోయిన కోటయ్య బదిలీ అయ్యారు.
- మీర్‌చౌక్ (లా అండ్ ఆర్డర్) పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మీసాల అప్పాల నాయుడు కూడా సీసీఎస్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్‌గా బేగంబజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందికూడ ఆనంద్ నియమితులయ్యారు.
- చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కె.నాగేందర్ ప్రసాద్ వర్మ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కాగా.. ఆయన స్థానంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జావీద్ మహ్మద్ అబ్దుల్ నియమితులయ్యారు.
- కామాటిపురా ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న తేజావత్ కొమురయ్య సీసీఎస్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చీర్ల యాదేందర్ నియమితులయ్యారు. ఇదే పోలీస్‌స్టేషన్‌కు చెందిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.
- కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన నాగెల్లి బుచ్చయ్య సిటీ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా.. ఇక్కడే డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న విక్రం సింగ్ కొత్తగా ఏర్పాటు చేసిన సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు.
- శాలిబండ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న గోపగల్ల కిషన్‌సెంట్రల్ జోన్ పోలీసు కంట్రోల్ రూమ్ (పీసీఆర్)కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిటీ స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన బానోతు సైదా నియమితులయ్యారు.
- చార్మినార్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎస్.మల్లేష్ కొత్తగా ఏర్పాటైన ఐ.ఎస్.సదన్ (లా అండ్ ఆర్డర్) పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- మార్కెట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎదుల శేఖర్ చార్మినార్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రవి గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ (లా అండ్ ఆర్డర్) ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కాగా.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎల్కపల్లి కమల్ కుమార్ ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- కొత్తగా ఏర్పడిన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా సీసీఎస్‌కు చెందిన గోగుల గోపి నియమితులయ్యారు.
- అలాగే సీసీఎస్‌కు చెందిన నిరంజన్ రావు ఐ.ఎస్.సదన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- సీసీఎస్‌కు చెందిన మరో ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు.
- సిటీ స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన రవికుమార్ బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రవి సీసీఎస్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- భవానీనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న శేఖర్‌రెడ్డి ఛత్రినాక డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- ఛత్రినాక డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న నాగరాజు చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ప్రమోద్ కుమార్ సీసీఎస్‌కు బదిలీ కాగా... ఆయన స్థానంలో సిట్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి నియమితులయ్యారు.

ప్రార్థనా స్థలాలు.. పవిత్ర స్థలాలు: ఎమ్మెల్యే కౌసర్



మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రార్థనా స్థలాలు పవిత్ర స్థలాలు అని, వాటిని పారదర్శకంగా నిర్వహించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ బంజార దర్వాజ అల్జాపూర్‌లోని కుతుబ్‌షాహీ మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుతుబ్‌షాహీ రాజుల నాటి ఈ మసీదుకు కొత్త రూపం ఇచ్చిన మసీదు నిర్వహణ కమిటీ వారిని ఆయన అభినందించారు. మసీదుకు ప్రార్థనలకు వచ్చే వారు మసీదు పరిరక్షణ, నిర్వహణ విషయంపై కూడా చొరవ చూపాలన్నారు. మసీదులపై వివాదాలు లేకుండా నిర్వహణ కమిటీ వారిపై ఆరోపణలు లేకుండా చూడాలని ఆయన కోరారు. మదర్సాలో ఖురాన్ బోధించే వారు వివాహ రహితులుగా ఉండాలన్నారు. అంతే కాకుండా మసీదు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వహణ కమిటీ వారిదేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హారూన్ ఫరాన్, మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు గులాం మొహియుద్దీన్ ఖాన్ పాషా భాయ్, అజీజ్‌ఖాన్ పఠాన్, షకీల్ అలీఖాన్, అజీజ్‌ఖాన్ పఠాన్, జుబేర్ బిన్ అవద్, సిరాజ్ ఖాన్ పట్టేదార్ తదితరులున్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం పదిలం



యోగా శిక్షణ కార్యక్రమంలో బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ కులకర్ణి, సత్యనారాయణ, లత

అబిడ్స్: యోగాసనాలతో మానవుడి జీవితం ఆరోగ్యకరంగా ఉంటుందని భారతీయ యోగ్ సంస్థాన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ కులకర్ణి పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రతిరోజూ ఉదయం కొంత సేపు అయినా యోగాసనాలు చేసేందుకు సమయం కేటాయించాలన్నారు. నాటి రుషుల కాలం నుంచి కూడా ప్రతిఒక్కరూ యోగా, ధ్యానం చేసి వంద సంవత్సరాల పాటు ఆరోగ్యకర జీవితం కొనసాగించారన్నారు. భారతీయ యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్ వ్యాధిపై బోధనలు చేశారు. భారతీయ యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నామన్నారు. నగరంతో పాటు రాష్ట్ర నలుమూలలా ఉచిత శిక్షణ తరగతులు చేపడుతున్నట్లు సుధీర్ కులకర్ణి తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు సత్యనారాయణ, లత, బీఆర్ఎస్ నాంపల్లి ఉపాధ్యక్షులు మెట్టు వెంకటేష్, గ్రేటర్ బీజేపీ నాయకులు మహేష్ తివారి పాల్గొన్నారు.

మ్యూజియం సందర్శన



మ్యూజియాన్ని సందర్శిస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, డాక్టర్ నాగేందర్‌రెడ్డి

చార్మినార్: దేశంలో శక్తివంతమైన మ్యూజియం పర్యావరణ వ్యవస్థకు ఎక్స్‌పో మార్గం సుగమం చేస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. న్యూఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఎక్స్‌పో-2023ను శుక్రవారం ఆయన మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 244 కంటే ఎక్కువ భారతీయ పురాతన వస్తువులను స్వదేశానికి రప్పించడం.. 145 కంటే ఎక్కువ మ్యూజియాల అభివృద్ధి జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో కల్పనా అవస్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో వైశాఖ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గౌలిపురా బతుకమ్మ బావి వద్ద ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు చీల రాములు గుప్తా, సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్ గుప్తా, కోశాధికారి కొల్కూరి నర్సింహులుగుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి గుప్తా, సభ్యులు బ్రహ్మదండి విశ్వనాథం, ముక్క శేఖర్, శిరంగి సంతోష్, లోకనాథ్, గౌరిశెట్టి విశ్వనాథం పాల్గొన్నారు.



ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



వేడుకల్లో పూజవ్యాస్ బిలాల్, పప్పుమాత్రే తదితరులు

అబిడ్స్: ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలలా ఆలయాల అభివృద్ధి కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. శుక్రవారం గోషామహల్‌లోని హిందీనగర్ దుర్గామాత ఆలయంలో శని జయంతి వేడుకలు, అమావాస్య పూజల్లో ఆమె పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. అనంతరం పూజవ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే వెంటనే మంత్రి తలసాని సహకారంతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులచే సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, సంజయ్, శంకర్ లాల్, సందీప్, జగ్‌మోహన్, విజయ్, జగపతి సాయి, శ్రీనివాస్ గౌడ్, శివరామ్ ప్రసాద్, సంతోషి, అనిత పాల్గొన్నారు.

సమాజ సేవకు వాసవి క్లబ్ అంకితం



కార్యక్రమంలో వరకుమార్ గుప్తా, సురేష్ కుమార్

అబిడ్స్: సమాజ సేవకే వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అంకితమని ఆ క్లబ్ అధ్యక్షుడు వరకుమార్ గుప్తా, పూర్వ అధ్యక్షుడు బిలకంటి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా హైదరాబాద్ నలుమూలలా వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. శుక్రవారం బేగంబజార్ భూలక్ష్మి ఆలయం వద్ద మహిళలకు వస్త్రదానం చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించి మాట్లాడారు. ప్రతి అమావాస్య రోజు వస్త్రదానం, అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి శ్రీనివాస్, ప్రవీణ్, నాగ లక్ష్మయ్య, శ్రీనివాసరావు, గోపాల్, మధు, అంబరీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్ తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్, జిల్లా, అస్సద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవా అన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక సేవా చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఎంఎన్‌జే ఆస్పత్రి వద్ద దాదాపు 700 మంది రోగుల సహాయకులకు పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు మొహ్మద్ అబ్దుల్ ముజీబ్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, శ్రీధర్, ముఖిమ్ ఖురేషి, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి కార్యదర్శి చంద్రశేఖర్, ప్రవీణ్, ప్రభుత్వ ఐటీఐ అధ్యక్షులు సత్యనారాయణ మరియు మిత్రుల రామకృష్ణారెడ్డి, ఏపీఆర్ఓ మహ్మద్ అబ్దుల్ వహీద్, ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదానం



గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగుల సహాయకులకు ప్రతినిత్యం అన్నదానం చేస్తున్నామని గోల్కొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ తెలిపారు. 435 రోజులుగా ఎటువంటి ఆటంకాలు లేకుండా గోల్కొండ, నాంపల్లి, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగుల సహాయకులకు అన్నదానం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజు 150 మందికి భోజన ప్యాకెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మహోత్తర కార్యక్రమానికి తోటి ఉద్యోగులు, దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.

రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలి



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల బంధు అమలు చేయాలని ప్రభుత్వానికి తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందు నిలిచిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల త్యాగాలను ఎట్టకేలకు గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ హస్త కళాకారులుగా చేతి వృత్తిదారులుగా సమాజ ఔన్నత్యం కోసం కమ్మర, వడ్రంగ, ఇత్తడి, శిల్పం, స్వర్ణకార వృత్తిదారులుగా జీవనం కొనసాగిస్తున్న విశ్వబ్రాహ్మణులకు లక్ష రూపాయాల చొప్పున నేరుగా ఆర్థిక సహకారం అందించటానికి ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో తీర్మానించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఈ విషయమై సంఘీయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సహకరించిన మాజీ శాసన సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సంఘ గౌరవ అధ్యక్షుడు వెంకటాచారి మాట్లాడుతూ.. సంఘీయుల ఆర్థిక స్వావలంబనకై ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ రూ.లక్ష కాకుండా రూ.5 లక్షల వరకు నేరుగా ఆర్థిక సహకారం అందించి విశ్వబ్రాహ్మణుల ఆకలి చావులు, ఆత్మహత్యలు నిరోధించే దిశగా కృషి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రాచారి, ఉపాధ్యక్షులు శ్రీనివాసచారి, వీరాచారి, వేణుగోపాల్, చంద్రమౌళి, సదానందం, పుష్పలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా జర్నలిజం విద్యార్థుల వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: నేటి జర్నలిజం కోర్సులు, జర్నలిజం వృత్తి మధ్య పొంతన లేకుండా పోయిందని, కోర్సులను నవీకరించాల్సిన అవసరం ఉందని, వార్తా సేకరణ, రచన, ప్రజా సంబంధాలు, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో జర్నలిజం విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెండో సంవత్సరం పీజీ జర్నలిజం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా కీలకంగా మారిందని, అందులో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, దానికి తగ్గట్టుగా మన నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, ప్రముఖ కార్టూనిస్టు శంకర్, వర్సిటీ జర్నలిజం శాఖ అధిపతి మారుపు వెంకటేశం, అధ్యాపకులు సుధీర్ కుమార్, రామాంజని కుమారి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు ఆత్మీయ గౌరవ పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో జస్టిస్ మాల్యాద్రి

నాంపల్లి: సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక ఆధ్యాత్మిక సేవా సంస్థ కమలాకర చారిటబుల్ ట్రస్టు, కమలాకర లలిత కళా భారతి సంస్థల నిర్వహణలో విశ్వవిఖ్యాత నట సార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు శత జయంతి సంబరం శీర్షికన ఆడపడుచులకు ఆత్మీయ గౌరవ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం గురువారం రాత్రి నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. విశ్రాంత ఏఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.ఆవులప్ప అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మాల్యాద్రి హాజరయ్యారు. గాంధీ మెడికల్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వీఎస్.ధనశ్రీ నాయుడు సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత రత్న డాక్టర్ శోభారాజు, నాట్య రత్న నిర్మలా ప్రభాకర్, సాహితీరత్న శ్రీదేవి, సేవా రత్న ఎం.సులోచన, సామాజిక రత్న టి.స్వర్ణలతకు ఆత్మీయ గౌరవ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి డాక్టర్ కె.వి.కృష్ణ కుమారి, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత చింతలపూడి త్రినాథరావు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షో



గోల్కొండ: ఈనెల 20 నుంచి మే 28వ తేదీ వరకు తమ షోరూంలో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీతో నిర్వహిస్తున్నామని మెహిదీపట్నం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ హెడ్ రమీజ్ తెలిపారు. శుక్రవారం షోరూంలో పలువురు మోడల్స్ ఆర్టిస్ట్రీ జ్యువెలరీ షోను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమీజ్ మాట్లాడుతూ.. ఈ షోలో విశిష్టమైన ఆభరణాల ప్రదర్శన ఉంటుందని, బంగారం, వజ్రాభరణాలు, జాతిరత్నాభరణాలను ప్రదర్శిస్తున్నామన్నారు. ఇందులో మైన్ ధ్రువీకరించిన వజ్రాభరణాలు, పెళ్లి ఆభరణాలతో పాటు ఎరా అన్‌కట్ విశిష్ట శ్రేణి ఆభరణాలు, ప్రెష్యా జాతి రత్నాభరణల ప్రదర్శనలో ఉంటాయని ఆయన తెలిపారు. తాము విక్రయించే ఆభరణాలు 100 శాతం గ్యారెంటీగా ఉంటాయని, బీఐఎస్ హాల్‌మార్క్ ఉంటాయని ఆయన పేర్కొన్నారు.


సిరివెన్నెల రసవాహిని పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ. రమణాచారి

గన్‌ఫౌండ్రీ: సిరివెన్నెల సీతారామశాస్త్రి సాహిత్యం ఎంతో గొప్పగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో కిన్నెర థియేటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ పైడిపాల పరిశోధనాత్మక రచన సిరివెన్నెల రసవాహిని పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ గీతాలలో సాహిత్యాన్ని పొందుపరిచి ఎంతో అద్భుతమైన పాటలను రచించారని గుర్తుచేశారు. నేటితరం రచయితలకు సిరివెన్నెల స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అంతకు ముందు గాయని గాయకులు ఆలపించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, సన్‌షైన్ ఆసుపత్రి అధినేత డాక్టర్ ఏవీ.గురువారెడ్డి, సినీ దర్శకుడు ఎస్వీ.కృష్ణారెడ్డి, నిర్మాత, అచ్చిరెడ్డి, రచయిత తోటపల్లి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభినయం ఎంతో ప్రాధాన్యం



కళాకారులతో నృత్యగురువు సరోజ వైద్యనాదం

గన్‌ఫౌండ్రీ: నేటి తరానికి శాస్త్రీయ సంగీత కళలపట్ల మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ నృత్య గురువు పద్మభూషణ్ సరోజ వైద్యనాదం అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో ది డ్యాన్స్ ఇండియా, రిలయబుల్ ఎడ్యుకేషనల్ సొసైటీల ఆధ్వర్యంలో అభినయంపై మూడురోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నృత్య రూపకాలలో అభినయం పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ప్రాచీన కళారూపాల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసినట్లు తెలిపారు. అభినయంపై నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌ను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విక్రమ్‌గౌడ్, బోనాల కిరణ్మయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

21న 'వాక్ యోగా-జ్యోతిర్ యోగా' సెమినార్

పంజగుట్ట: గురు మహరాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21న బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో వాక్ యోగా-జ్యోతిర్ యోగా ప్రారంభ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ సాయి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని న్యాయమూర్తి మల్యాద్రి, ఆర్య వైశ్య మహాసభ పొలిటికల్, మీడియా చైర్మన్ సంజయ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ అక్షరంలో ఏ శక్తి ఉంది, ఏ అక్షరంతో మన కోపం తగ్గించుకోవచ్చు, ఎంతో ఒత్తిడిలో ఉన్నప్పుడు ఒత్తిడి దూరం చేసుకునేందుకు ఏ అక్షరం పలకాలి అనే విషయాలు ఒకరోజు సెమినార్ ద్వారా వివరిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి యోగా సంస్కృతం యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ బి.వి.కె.శాస్త్రి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో రాజేష్ మిర్యాల, కూర నాగరాజు, బి.శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.